క్లుప్తంగా

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆధార్ శిబిరం ఏర్పాటు



పెడన: ఆధార్ నవీకరణ కోసమే కాకుండా కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు పట్టణంలోని తొమ్మిదో సచివాలయ పరిధిలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేశారు. వార్డు ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ప్రాసెసింగ్ సెక్రటరీ సాయిదుర్గమహేష్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాలలో ఈ నెల పదో తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. రోజూ ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ నమోదు కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



పెడన: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని పెనుమల్లి గ్రామానికి చెందిన దేవరపల్లి రాంబాబు ఇల్లు ఇటీవల దగ్ధమైంది. బాధిత కుటుంబానికి నేలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ వూచా సత్యనారాయణ బుధవారం నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. రాంబాబు ఇంటికి సత్యనారాయణ వెళ్లి అతని కుటుంబసభ్యులను పరామర్శించి జరిగిన ఘటనపై ఆరా తీశారు.

వృద్ధురాలి కార్నియాల సేకరణ


రాఘవమ్మ(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని ఐదో వార్డుకు చెందిన తుంగల రాఘవమ్మ(80) బుధవారం మరణించారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు శివనాగేశ్వరరావు ప్రోత్సాహంతో భర్త సోమేశ్వరరావు(సోములు), కుమార్తె అరుణ ఇతర కుటుంబ సభ్యులు రఘువమ్మ నేత్రదానానికి ముందుకొచ్చారు. నేత్రదాన మోటివేటర్స్ టి.రఘుశేఖర్, కె.నారాయణ సహకారంతో ఆస్పత్రి కంటి వైద్యనిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌తో కూడిన బృందం మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి



పెడన: ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదును వేగవంతం చేయాలని పెడన ఏఓ జీ.వి.శ్రీనివాసరావు సంబంధిత ఉద్యోగులకు సూచించారు. మండలంలోని చేవేంద్ర గ్రామంలో ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వీఏఏలు, ఎంపీఈఓలు 2022-23 ఏడాదిలో రబీ సాగుకు సంబంధించి రైతులు నుంచి ఈ-క్రాప్ నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ-క్రాప్‌తో పాటే ఈకేవైసీ కూడా చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ 40 శాతమే పూర్తయిందన్నారు. మిగిలిన 60 శాతాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలో ఈ- క్రాప్ నమోదులో వెనుకబడిన వారిపై శాఖా పరమైన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వీఆర్వో యోధా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు

పెదపారుపూడి: విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వరరావు గుడివాడ డివిజన్ ఈఈ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ చౌర్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 39 బృందాలుగా ఏర్పడి 3,221 గృహ విద్యుత్ సర్వీసులు, 220 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశామని పేర్కొన్నారు. 202 సర్వీసులు అదనపు లోడుకు గాను రూ.5.42 లక్షల జరిమానా విధించామని చెప్పారు. అనుమతి ఇచ్చిన కేటగిరీ కాకుండా వేరే కేటగిరిలో వాడుతున్న ఇద్దరు వినియోగదారులకు రూ.6,500 జరిమానా వేశామని పేర్కొన్నారు. ఎక్కడైన విద్యుత్ చౌర్యం జరిగితే 94408 12086, 94408 17579 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏడీ దశరథ్, మండల ఏఈ వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలుచేసే ఎన్నికలకు వెళ్తాం

- వైఎస్సార్ సీపీ మరింత బలంగా మారింది
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- యార్లగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

యార్లగడ్డ (చల్లపల్లి): వైఎస్సార్ సీపీ గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత బలంగా ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లి మండలం యార్లగడ్డలో సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గ్రామంలోని బీసీ కాలనీ, రెండు ఎస్సీ కాలనీల్లో 640 ఇళ్లను సందర్శించారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ.. 2019లో ప్రజలకు హామీలిచ్చి ఎన్నికల్లో విజయం సాధించామని గుర్తుచేశారు. ఆ హామీలన్నీ అమలు చేసి 2024లో ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము వెళ్లిన ప్రతి ఇంటిలోనూ లబ్ధిదారుల కళ్లల్లో సంక్షేమ పథకాలు పొందిన సంతృప్తి, ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, కర్రా రవి, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్, వైఎస్సార్ సీపీ నాయకులు బొందలపాటి లక్ష్మి, కుందేటి కోటేశ్వరరావు, మాతంగి దుర్గారావు, మోదుమూడి కుటుంబరావు, మేరుగు రమేష్, వెనిగళ్ల తారక జగదీష్, ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఎం. అరుణ కుమారి, గ్రామ సచివాలయాల కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థికి ప్రశంసలు


విద్యార్థి గోపీని అభినందిస్తున్న వీసీ రామ్మోహనరావు

చిలకలపూడి(మచిలీపట్నం): జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థి బి.గోపి పాల్గొన్నాడు. ఆ విద్యార్థిని వైస్ చాన్స్‌లర్ కె.రామ్మోహనరావు బుధవారం అభినందించారు. గోపి గణతంత్ర వేడుకల్లో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ దాంకర్, ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆ విద్యార్థిని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో గోపిని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అభినందించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొనాని సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్కరిణి అభివృద్ధి పనులు ప్రారంభం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన పుష్కరిణి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం ఉదయం ప్రారంభిస్తారని ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు బుధవారం తెలిపారు. రూ.1.50 కోట్లతో ఈ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. మంత్రులు కొట్టు సత్యనారాయణ, ఆర్.కె.రోజా, జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జెడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక, వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.ఎస్.నాగిరెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, టి.కల్పలత తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత


బాధితులకు సాయం అందచేసిన తహసీల్దార్ విమలకుమారి, రెడ్‌క్రాస్ చైర్మన్ శివవిష్ణు

నాగాయలంక: మండలంలోని సొర్లగొంది గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన వనమాల సంపూర్ణమ్మ కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచి ఆధ్వర్యంలో బుధవారం ఫైర్ యాక్సిడెంట్ కిట్లు అందించారు. రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, తహసీల్దార్ జె.విమలకుమారి, చైర్మన్ భోగాది శివవిష్ణు వర్ధన్ చేతులమీదుగా కట్ట బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, టార్పాలిన్స్, దోమతెరలు పంపిణీ చేశారు. సర్పంచ్ వనమాల నాంచారమ్మ, గాలిదేవుడు, వీఆర్వో శ్రీనివాసరావు, వనమాల రమేష్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మునగాల కుటుంబరావు, యర్రంశెట్టి నాగపవన్, తుంగల చరణ్, పిరాటి బలరామ్, పొన్నూరు భాను తదితరులు పాల్గొన్నారు.

15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు బుధవారం తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రైతు సేవలో కేడీసీసీ బ్యాంక్

ముదినేపల్లి రూరల్: రైతుల సంక్షేమం కోసం కేడీసీసీ బ్యాంక్ పలు పథకాలు ప్రవేశపెట్టినట్లు బ్యాంక్ ముదినేపల్లి బ్రాంచ్ మేనేజర్ వీవీఎల్ఎస్ కుమార్ అన్నారు. మండలంలోని వాడవల్లిలో సొసైటీ అధ్యక్షురాలు బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యాన కేడీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలపై కళాజాత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులతో పోటీగా రైతులకు సహకార సంఘాల ద్వారా కేడీసీసీ బ్యాంక్ రుణాలు అందిస్తుందని చెప్పారు. రుణాలపై తక్కువ వడ్డీ వసూలు చేస్తూ డిపాజిట్లకు అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను బిల్లపాడుకు చెందిన కళాకారులు ఎం.శేఖర్‌బాబు, ఎం.తిరుపతి కుమార్, బి.రమేష్, వై.వీరయ్య కళాజాత ద్వారా వివరించారు. సూపర్‌వైజర్ నాగభూషణం, సొసైటీ సెక్రటరీ కె.నాగ మునీంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాదుల సంక్షేమానికి కృషి

మచిలీపట్నంటౌన్: నగరంలోని యానాదుల సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తెలిపారు. నగరంలోని 49వ డివిజన్ నారాయణపురంలో ఉన్న యానాదులకాలనీలో బుధవారం జరిగిన సంబరానికి పేర్ని కిట్టు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలనీకి విచ్చేసిన పేర్ని కిట్టుకు యానాదులు తమ సంప్రదాయ పద్ధతిలో డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న పక్కా గృహాలు శిథిలం కావటంతో వాటికి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఆధార్ లేని వారి కోసం ప్రత్యేక శిబిరం ద్వారా ఆధార్‌కార్డులు ఇప్పించామన్నారు. యానాదులకాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని వివరించారు. యానాదులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. 49, 22 డివిజన్ల కార్పొరేటర్లు పల్లి శేఖర్, ఏకశిరి వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, బడే భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై గుర్తుతెలియని వ్యక్తి దాడి

కోనేరుసెంటర్: నగరంలో ఓ బాలికపై మరోమారు దాడి జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బాలిక నుంచి వివరాలు సేకరించారు. బాలిక చేసిన ఆరోపణతో పోలీసులు సైతం అయోమయంలో పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. ఎప్పటిలానే బుధవారం సాయంత్రం సైకిల్‌పై చెక్కలమేడ సెంటర్‌లో ట్యూషన్‌కు బయలుదేరింది. చెక్కలమేడ సెంటర్ సమీపంలో బాలిక ఒక్కసారిగా సైకిల్ దిగి ఆ పక్కనే ఉన్న ఓ టిఫిన్ బండి వద్దకు వెళ్లి తనపై గుర్తుతెలియని వ్యక్తి బ్లేడుతో దాడి చేశారంటూ చెప్పింది. దీంతో స్థానికులు చుట్టుపక్కల ఆ గుర్తుతెలియని వ్యక్తి కోసం గాలించారు. ప్రయోజనం లేకపోవటంతో బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలికతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. గతంలో తనపై దాడి చేసిన వ్యక్తే మళ్లీ బ్లేడుతో గాయపరిచాడని బాలిక చెప్పింది. గతంలో బాలికపై దాడి చేసిన వ్యక్తిని ఈ నెల ఎనిమిదో తేదీన రిమాండ్‌కు పంపగా అదే వ్యక్తి మళ్లీ దాడి ఎలా చేస్తాడంటూ పోలీసులు అయోమయంలో పడ్డారు. తన కుమార్తెపై దాడి చేసిన వ్యక్తిని కాకుండా వేరే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చూపించారంటూ తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించగా, బాలిక చెప్పిన సమయంలో ఆ ప్రాంతంలో సదరు బాలిక తప్ప ఇతర వ్యక్తులు ఎవరూ వెళ్లినట్లు కనిపించలేదు. బాలిక ఫిర్యాదు మేరకు ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చిరుధాన్యాలపై అవగాహన

విజయవాడ రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం నిడమానూరు గ్రామంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వనరుల కేంద్రం నుంచి కోఆర్డినేటర్స్ టి.మాధవీలత, మోనిషా పాల్గొంటారని ఆయన తెలియజేశారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

తోట్లవల్లూరు: ఈ నెల 18న జరిగే శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఐలూరు గల గంగాపార్వతి సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శివ రాత్రి ఏర్పాట్లపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి పంచాయతీ, రెవెన్యూ, ఫైర్, ట్రాన్స్‌కో, ఫిషరీస్, ఆర్టీసీ, పోలీస్, సెబ్, వైద్యం, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో శివరాత్రికి తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. లక్ష మందికిపైగా తరలివచ్చే భక్తజనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ పిరాటి సుజాత, సీఐ ఎం. కిషోర్‌బాబు, ఎస్ఐ రమేష్, ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్య సూర్య వరప్రసాద్, ఎంపీటీసీ భీమవరపు శ్రీలక్ష్మి, షేక్ లతీఫ్, ఆలయ మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. బాపులపాడు మండలంలో మొత్తం సుమారు 3,000 మంది లబ్ధిదారులకు గృహరుణాలు మంజూరు కాగా కేవలం 500 మంది మాత్రమే ఇప్పటి వరకూ నిర్మాణాలు పూర్తి చేశారని ఆమె చెప్పారు. దీనిపై ఆర్డీఓ పద్మావతి మండలంలోని గ్రామాల వారీగా ఆయా అధికారులకు టార్గెట్లు నిర్ణయించారు. వచ్చే నెలలో ఉగాది పర్వదినం నాటికి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను కలిసి ప్రభుత్వం అందిస్తున్న గృహ రుణాల గూర్చి వివరించాలని చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు వేగంగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులతో చర్చలు జరపాలని సూచించారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, డెప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీఓ ప్రభాకరరావు, పంచాయతీ రాజ్ ఏఈ డి.జయరాజు, హౌసింగ్ ఏఈ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను సమర్థంగా నిర్వహిద్దాం

ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. గ్రామంలో బుధవారం కల్యాణ మండపంలో అన్ని శాఖల అధికారులకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు పుణ్యనది స్నానాలు చేసే సమయంలో నది వద్ద పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. భక్తులు రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వైద్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. గుడిపై ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు త్రాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం రాత్రి భక్తుల పోటెత్తే అవకాశం ఉండటంతో పోలీసులు, ఫైర్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, శాంతిభద్రతలు కాపాడాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ టి.వి.సతీష్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, సీఐ ఆర్.గోవిందరాజు, ఎంపీడీఓ సునితాశర్మ, మండల వైద్యాధికారి రవికుమార్, దేవస్థానం ఈఓ ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

డాక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు సత్కారం



గుడివాడటౌన్: ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ పిన్నమనేని ప్రశాంత్ కుమార్‌ను ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్థోపెడిక్ విభాగంలో ఉత్తమ సేవ అవార్డును రాష్ట్ర గవర్నర్ హరిచందన్ విశ్వభూషణ్ చేతుల మీదుగా అందుకున్న వైద్యుడు పట్టణంలో సేవలందిచండం అభినందనీయం అన్నారు. క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, ఉపాధ్యక్షుడు కొనకళ్ల సీతయ్య, చిట్టిబాబు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం


చెత్త ప్రాసెసింగ్ యూనిట్ పనితీరును పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, సలార్‌దాదా, నోబుల్

మచిలీపట్నంటౌన్: నగర శివారులో ఉన్న డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఏర్పాటు చేసిన లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ బుధవారం ప్రారంభించారు. డంపింగ్‌యార్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని ఆమె స్విచ్చాన్ చేసి ప్రారంభించటంతో చెత్త ప్రాసెసింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేరుకుపోయిన చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) వివరించటంతో ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటైందని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా పేరుకుపోయిన వ్యర్థాల్లో రాళ్లు, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేస్తుందని పేర్కొన్నారు. మట్టి, రాళ్లను లోతట్టు ప్రాంతాలను మెరక చేసేందుకు వినియోగించి, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎనర్జీ ప్లాంట్లకు తరలిస్తామని తెలిపారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్‌యార్డులో చెత్తను అధునాతన పద్ధతిలో ప్రాసెసింగ్ చేస్తారని వివరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో-ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీకాంత్, ఎగ్గోని గాంధీ, బందెల థామస్ నోబుల్, చిటికిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేతో రైతులకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రసాద్

గూడూరు: మండలంలోని గంగ్రం, కంకటావ గ్రామాల్లో బుధవారం సమగ్ర భూ సర్వే గ్రామసభలను నిర్వహించారు. తహసీల్దారు బి.వి.ప్రసాద్ అధ్యక్షతన ఈ సభలు జరిగాయి. భూ సర్వేతో రైతులకు ఒనగూరే ప్రయోజనాలను తహసీల్దార్ వివరించారు. వ్యవసాయ భూముల వివాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రైతులు దగ్గరుండి ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. కంకటావలో వైఎస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, సర్పంచి మద్దాల వీర వెంకట మోహనరావు, గంగ్రంలో సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపిటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, మండల సర్వేయరు జి.వెంకటేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థులు


చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కోడూరు మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఏలూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇటీవల అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. మండలంలోని వి.కొత్తపాలెం, సాలెంపాలెం జెడ్పీ పాఠశాలల విద్యార్థులు రేపల్లె యశోద, కె.చంద్రశేఖర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎంలు వి.శ్రీనివాసరావు, మీర్జా ఆలీరాజా తెలిపారు. యశోద, చంద్రశేఖర్‌తో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు బడే వెంకటేశ్వరరావు, గాజుల లక్ష్మీప్రసాద్‌ను జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, పీఎంసీ చైర్మన్లు రేపల్లె కృష్ణవేణి, కొక్కిలిగడ్డ సముద్రాలు, పాఠశాల కమిటీ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేస్తూ ఉత్తర్వులు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా మార్పు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పామర్రు నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. సీహెచ్‌సీగా ఏర్పడటంతో 30 పడకలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అంతే కాకుండా 38 మంది నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణతో కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. మొత్తం రూ.8.18 కోట్ల అంచనా విలువలతో సీహెచ్‌సీ పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు గైనకాలజిస్టు, ఎనస్తీషియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్, సర్జన్ జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పామర్రు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే మంజూరు చేశారన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్‌కు ముగ్గురు విద్యార్థులు


సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలకు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో డి.లక్ష్మీభాయ్, అండర్-17 బాలుర విభాగంలో డి.రామ్‌చంద్, అండర్-19 బాలికల విభాగంలో డి.పూజిత కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో అండర్-17, అండర్-19 బాలుర, బాలికలకు,16, 17 తేదీల్లో అండర్-14 బాలబాలికలకు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గృహ నిర్మాణాల్లో ముందంజలో నిలవాలి


జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్న గృహ నిర్మాణాల్లో కైకలూరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్‌లో జగనన్న గ్రీన్ విలేజ్‌లో గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో పెద్ద లేఅవుట్‌లు ఉన్నాయన్నారు. ఇప్పటికే అర్హులైన అనేక మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఆర్త హోమ్స్ సంస్థ నిర్మాణాలకు ముందుకు రావడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. ఏలూరు రోడ్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇప్పటికే విద్యుత్, తాగునీరు, రహదారులను ఏర్పాటు చేశామన్నారు. సచివాలయం, అంగన్‌వాడీ, పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, శ్మశానం, తాగునీటి చెరువు ఇలా అనేక సౌకర్యాలు ఇక్కడ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలని సూచించారు.